మజీద్‌పూర్ పాఠశాలలో ఏఐ ల్యాబ్ ప్రారంభం



మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏఐ ల్యాబ్‌లో పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ను బుధవారం స్కూల్ హెచ్‌ఎం విజయభాస్కర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఏఐ ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధించా రు. విద్యార్థులకు చదవం, రాయడం వచ్చేలా చూడడమే ఈ కార్యక్రమం ము ఖ్య ఉద్దేశ మన్నారు. దీంతో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతాయన్నారు. స్కూల్‌లో 3 నుంచి 5వ తరగతి చదివే విద్యార్థులకు కనీస అభ్యాస సామర్థ్యాలను పెంచేలా ఏఐను వినియోగించనున్నట్లు తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను బ్యాచ్‌లుగా ఎంపిక చేసి తెలుగు, ఆంగ్ల సబ్జెక్టులు బాగా చదవడం, రాయడంతో పాటు గణిత అంశాల్లో పట్టు సాధించేలా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంగ్లీష్ టీచర్ వెంకటేష్, కంప్యూటర్ టీచర్ మహేష్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



చంపాపేట చౌరస్తాలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చలివేంద్రం ప్రారంభం

చంపాపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బాటసారుల దాహం తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయని కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి అన్నారు. చంపాపేట చౌరస్తాలో బుధవారం బైగళ్ల బాలయ్య, పొన్నమ్మల స్మారకార్థం వారి కుమారుడు బైగళ్ల రవీందర్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వంగా మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. 13సంవత్సరాలుగా బైగళ్ల రవీందర్ చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయం అని కార్పొరేటర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సామ రమణారెడ్డి, బైగళ్ల బాలమణి, నాయకులు, బస్తీవాసులు అశోక్, జగదీశ్వర్, మాతంగి నర్సింహ, మాతంగి యాదగిరి, ఈశ్వర్, పాశం శ్రీశైలం, ఆనంద్‌నాయుడు, వెంకట్‌నారాయణ, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న హైదరాబాద్ లారీ సప్లయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోకూరి శ్రీనివాస్‌బాబు తదితరులు

దాహార్తిని తీర్చడంలో చలివేంద్రాలు దోహదం

మన్సూరాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పాదచారుల దాహార్తిని తీర్చడంలో చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని హైదరాబాద్ లారీ సప్లయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోకూరి శ్రీనివాస్‌బాబు పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్‌లో హైదరాబాద్ లారీ సప్లయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్

పాతబస్తీలో బీజేపీ గెలిచేందుకు కృషి : నిరంజన్

సైదాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వచ్చే గ్రేటర్ ఎన్నికల్లో పాతబస్తీలో అధిక డివిజన్లలో బీజేపీ జెండా ఎగురవేసేందుకు సమష్టి కృషి చేస్తామని ఆ పార్టీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్ అన్నారు. బుధవారం కుర్మగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఓవైసీ సోదరుల వల్లే పాతబస్తీలో అభివృద్ధి కుంటుపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓటు బ్యాంకు రాజకీయాలను ఎంఐఎం నేతలు అనువుగా వాడుకుంటున్నారని తెలిపారు. అభివృద్ధి పనులలో సైతం పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా అభివృద్ధిని అడ్డుకుంటే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. త్వరలో పాతబస్తీ అంతటా పాదయాత్ర చేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు యుగేందర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి నాగరాజు, నేతలు శ్రీకాంత్‌రెడ్డి, ప్రమోద్ పాల్గొన్నారు.

రేపు సహకార సంఘం సర్వసభ్య సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బాటసింగారం రైతుసేవా సహకార సంఘం 56వ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు సంఘం మేనేజర్ జక్కుల ఐలేష్‌యాదవ్ తెలిపారు. సంఘం ఆవరణలోని గార్డెన్‌లో ఉదయం 11.30 గంటలకు చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందన్నారు. పలు ఎజెండా అంశాలపై చర్చించి సభలో ఆమోదం తెలుపనున్నట్లు చెప్పారు. సంఘం పరిధిలోని రైతులు, సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.



స్వాధీనం చేసుకున్న నగలు చూపుతున్న పోలీసులు

ఇద్దరు ఘరానా దొంగల అరెస్ట్

● రూ. 15లక్షల సొత్తు స్వాధీనం

హైదరాబాద్ సిటీ : వరుస చోరీలు చేస్తున్న ఇద్దరు ఘరానా పాత నేరస్థులను సౌత్‌ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, సైదాబాద్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. బిస్మిల్లా కాలనీకి చెందిన పాత నేరస్థుడు హబీబ్ మహ్మద్ అలియాస్ ఛోటు(37) చోరీల్లో దిట్ట, ఇతడు 2000 సంవత్సరం నుంచి 59 ఇంటి దొంగతనాలకు పాల్పడ్డాడు. మొఘల్‌పురాకు చెందిన హబీబ్ అలీ అలియాస్ అలీ(49) కూడా పాత నేరస్థుడే. ఇతడు 8 చోరీలకు పాల్పడ్డాడు. జైలులో పరిచయమైన ఇద్దరూ కలిసి చోరీలు చేయాలని పథకం వేసుకున్నారు. బయటకు వచ్చిన తర్వాత మొదట బైక్ చోరీ చేశారు. ఈ బైక్‌పై తిరుగుతూ రెక్కీ నిర్వహించి మొఘల్‌పురాలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో హబీబ్ అహ్మద్ చోరీ చేసినట్లు గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 5 చోరీ కేసులకు సంబంధించి రూ.15లక్షల విలువైన 145 గ్రాముల బంగారు నగలు, మూడు ఫోన్‌లు, హోండాషైన్ వాహనం, వాచ్‌తోపాటు చోరీకి వినియోగించే సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

అభివృద్ధికి నోచుకోని శివారు కాలనీలు

● అన్ని పన్నులు కడుతూ అవస్థలు పడుతున్న కాలనీవాసులు

● మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీవాసుల డిమాండ్



సౌభాగ్యనగర్ కాలనీ నుంచి మహాలక్ష్మి కాలనీకి వెళ్లేందుకు రాచకాలువపై దారి



శ్రీనివాసపురం కాలనీలో గుంతలమయంగా మారిన మట్టిరోడ్డు

వనస్థలిపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని శివారుకాలనీల పరిస్థితి నెలకొంది. ప్రభుత్వానికి అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నా అభివృద్ధి మాత్రం శూన్యం. కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తాము మహానగరంలో ఉన్నామా.. లేక పల్లెటూరిలో ఉన్నామా అని సదరు కాలనీవాసులు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం దశాబ్ద కాలంగా ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ.. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో అనేక నూతన కాలనీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనడంలో అతిశయోక్తి లేదు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో శివారు ప్రాంతాల్లోని కాలనీలైన బ్యాంక్‌కాలనీ, గాయత్రీనగర్, ఫేజ్-1, 2, 3, 4 శ్రీనివాసపురంకాలనీ, బృందావన్ మెడోస్‌కాలనీ, విజయనగర్‌కాలనీ, సౌభాగ్యనగర్, మహాలక్ష్మికాలనీ, జక్కిడి రాంరెడ్డికాలనీ, పాపిరెడ్డికాలనీలతో పాటు ఇతర కాలనీల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలమవుతున్నారని కాలనీవాసులు పేర్కొంటున్నారు. అభివృద్ధి చెందిన కాలనీలకే నిధులు మళ్లించి, మంచిగా ఉన్న రోడ్లు, డ్రైనేజీలు తొలగించి నూతన హంగులతో కూడిన అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, కేవలం పర్యవేక్షణలకే పరిమితం అవుతూ.. మౌలిక సదుపాయాలు కల్పించడంలో వెనుకబడిపోయారని వాపోతున్నారు. అదేవిధంగా పలు కాలనీల్లో వర్షపునీరు వెళ్లడానికి ఏర్పాటు చేసిన రాచకాలువలను భూ కబ్జాదారులు ఆక్రమించుకుంటున్నప్పటికీ సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో సదరు రాచకాలువలు కబ్జాలకు గురవుతున్నాయని కాలనీవాసులు తెలిపారు.

రవాణా సౌకర్యం లేక అవస్థలు

అసలే శివారు కాలనీలు కావడంతో రవాణా సౌకర్యం లేకపోవడంతో సొంత వాహనాలు, ఆటోలపై ఆధారపడాల్సి వస్తుంది. దీంతో ఇంట్లో సరుకులు తీసుకరావాలన్నా, అనారోగ్యానికి గురైతే ఆస్పత్రికి వెళ్లాలన్నా, విద్యార్థులు, ఉద్యోగులు ఇలా అనేక మంది తమ సొంత పనుల మీద ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. గతంలో కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఉదయం, సాయంత్రం రెండు పూటల మాత్రమే ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండడంతో ఇతర సమయంలో ప్రైవేట్ వాహనాలే తమకు దిక్కు అవుతుండడంతో అధిక మొత్తంలో ఖర్చులు అవుతున్నాయని కాలనీవాసులు తెలిపారు. శివారు కాలనీవాసుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు బస్సులను ఎక్కువ ట్రిప్పులను నడిపించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు

మిషన్ భగీరథలో భాగంగా శివారు కాలనీలకు తాగునీరు సౌకర్యం వచ్చిన, డ్రైనేజీ అవుట్‌లెట్ ఉన్న కొన్ని కాలనీలకు డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. డ్రైనేజీ అవుట్‌లెట్‌లేని కాలనీలకు నేటికీ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా గతంలో ఏర్పాటు చేసిన మట్టిరోడ్లపై గుంతలుపడి వాహనాల రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు శివారు కాలనీల అభివృద్ధిపై దృష్టిసారించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పార్కు స్థలాలకు రక్షణ కరువు

ప్రతి కాలనీలో లేఅవుట్‌లో భాగంగా ఖాళీ స్థలాలను కాలనీవాసుల అవసరాల కోసం వదిలేశారు. కాలనీవాసులకు ఎక్కువగా ఉపయోగపడే పార్కులను ఏర్పాటు చేసుకుంటారు. అందులో భాగంగా పలు కాలనీల్లోని పార్కు స్థలాలకు కొన్ని చోట్ల బెం చీలు వేసి పార్కుకు ప్రహరీ, వాకింగ్ ట్రాక్ నిర్మిస్తే కాలనీవాసులకు ఉపయోగకరంగా ఉంటుందని కాలనీవాసులు తెలిపారు. ఇదే విషయంపై అధికారులను, పాలకులను అడిగితే..ఇప్పటికే డ్రైనేజీ, తాగునీరు ఉన్న కాలనీల్లో ఫార్మేషన్ రోడ్లకు ప్రతిపాదనలు పంపామని, అవుట్‌లెట్ కాలనీల్లో డ్రైనేజీ వేయలేదని పేర్కొన్నారు.

పాములు, పందులు, దోమల బెడద ఎక్కువైంది



కాలనీల్లో చెత్తకుప్పలు ఉండడం వల్ల పాముల బెడదతో పాటు పందులు కాలనీల్లో సంచరించడం ఎక్కువైంది. లో వోల్టేజీ సమస్యతో ఇంటి ఎలక్ట్రికల్ వస్తువులు పాడవుతున్నాయి. దోమల బెడదతో కాలనీవాసులకు చికెన్‌గున్యా, డెంగీ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

- గౌరిశెట్టి మనోజ్‌కుమార్, అధ్యక్షుడు, గాయత్రీనగర్‌కాలనీ ఫేజ్-4 సంక్షేమ సంఘం

జనావాసాల మధ్య ఉన్న వైన్‌షాప్‌లను తొలగించాలి



జనావాసాల మధ్య ఉన్న వైన్‌షాప్‌ల వల్ల తలెత్తుతున్న సమస్యలను కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డికి వివరిస్తున్న కాలనీవాసులు

వనస్థలిపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య ఉన్న వైన్‌షాప్‌లను తొలగించాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం రైతుబజార్ సమీపంలోని శ్రీసాయి సూర్య వైన్స్, బార్‌లు హయత్‌నగర్ డివిజన్ కమలానగర్ కాలనీకి ఆనుకుని ఉన్నది. ఈ వైన్స్, బార్‌లతో ప్రతినిత్యం తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు బుధవారం సదరు వైన్స్, బార్ పరిసర ప్రాంతాలను కాలనీవాసులతో కలిసి పరిశీలించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కమలానగర్‌లోని వైన్స్, బార్‌లతో రాత్రి వేళలో మహిళలు, చిన్నపిల్లలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారన్నారు. కాలనీ ఆనుకుని వైన్స్ ఉండడంతో కాలనీ వీధుల్లో ఎక్కడపడితే అక్కడ మద్యం తాగి, ప్రతి రోజు పెద్ద, పెద్ద అరుపులతో గొడవలు జరుగుతుండడం సహించరానిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీవాసులకు ఇబ్బందులు సృష్టిస్తున్న శ్రీ సాయి సూర్య వైన్స్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కార్పొరేటర్ ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లను అర్హులకు ఇవ్వాలి : ఎల్లయ్య



జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

ఎల్‌బీనగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లను అర్హులైన పేదలకు ఇవ్వాలని సీపీఎం ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గుడుస్తున్నా పేదల ఇళ్ల సమస్యను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఇల్లు లేని పేదలందరికీ ఇళ్లు ఇస్తామని సర్వే చేయించి డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు దరఖాస్తు చేసుకోమన్నారని చెప్పారు. దరఖాస్తు చేసుకున్నవారికి నేటికీ ఆ ఇళ్లు అందలేదన్నారు. వనస్థలిపురం, నందనవనంలలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ ఎవరికీ ఇవ్వలేదన్నారు. వెంటనే వనస్థలిపురం, నందనవనంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి ఇల్లు లేని పేదలందరికీ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్కిల్ కమిటీ సభ్యులు రామస్వామి, కాశయ్య, రాధమ్మ, సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి వెంకన్న, సభ్యులు వీరయ్య పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పొజిషన్ చూపి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



రామోజీ ఫిలిం సిటీ దగ్గరకు ర్యాలీగా వస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, లబ్ధిదారులు

ఇబ్రహీంపట్నం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టాలున్న లబ్ధిదారులకు పొజిషన్ చూపి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, లబ్ధిదారులు భూముల వద్దకు పోకుండా రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం గేట్లు పెట్టి అడ్డుపడుతోందని, గేట్లను తొలగించి పేదలకు న్యాయం చేకూర్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మండల పరిధి నాగన్‌పల్లి రెవెన్యూ రామోజీ ఫిలింసిటీలో గతంలో పట్టాలు పొందిన లబ్ధిదారులకు పొజిషన్ చూపి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వెస్లీ మాట్లాడుతూ నాగన్‌పల్లి రెవెన్యూ సర్వే.నం. 189, 203లలో 20.04 ఎకరాల ప్రభుత్వ భూమి రామోజీ ఫిలింసిటీ ఆధీనంలో ఉండగా.. 2007లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో ఇక్కడ ఉన్న కొన్ని కట్టడాలను తొలగించారన్నారు. అప్పట్లో నాగన్‌పల్లి, పోల్కంపల్లి, రాయపోల్, ముకునూరు గ్రామాలకు చెందిన 577మంది పేదలకు ఈ భూముల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఇందిరమ్మ పథకం కింద ప్రొసీడింగ్‌లు కూడా ఇచ్చారన్నారు. అయితే ఈ భూముల్లోకి ఎవరూ రాకుండా రామోజీ ఫిలింసిటీ యాజమాన్యం గేట్లు బిగించిందన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, పేదల భూములు ఆక్రమించిన రామోజీ సంస్థ యాజమాన్యంపై కేసు పెట్టాలని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయితే కొందరు ఆందోళనకారులు గేట్లు ఎక్కి లోనికి దూకగా, మరికొందరు ఒక్కసారిగా గేట్లు తోసుకుని భూముల వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది. జిల్లా కమిటీ సభ్యుడు పి.జగన్, వెంకటమ్మలు స్వల్పంగా గాయపడి సొమ్మసిల్లి పడిపోగా ఆసుపత్రికి తరలించారు. అరెస్టు చేసిన ఆందోళనకారులను ఇబ్రహీంపట్నం, యాచారం పోలీస్ స్టేషన్‌లకు తరలించారు.



ల్యాబ్‌లో కమ్ముకున్న పొగలు

ల్యాబ్‌లో అగ్నిప్రమాదం

● రూ.40లక్షల వరకు ఆస్తినష్టం

సంతోష్‌నగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సంతోష్‌నగర్‌లోని లక్ష్మి డయాగ్నోస్టిక్ అండ్ స్పెషాలిటీ ల్యాబ్‌లో బుధవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడడంతో అగ్నిప్రమాదం జరిగింది. ఐఎస్‌సదన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్‌లోని యాదగిరి థియేటర్ సమీపంలో లక్ష్మి డయాగ్నోస్టిక్ అండ్ స్పెషాలిటీ ల్యాబ్ కొనసాగుతుంది. కాగా బుధవారం సాయంత్రం డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో వెంటనే అప్రమత్తమైన నిర్వాహకులు మలక్‌పేట అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి, ఐఎస్‌సదన్ పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సమయానికి చేరుకొని మంటలను అదుపుచేయడంతో పెనుప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో సుమారు రూ.40లక్షల ఆస్తినష్టం జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. విషయం తెలుసుకున్న సంతోష్‌నగర్ కార్పొరేటర్ ముజఫర్ హుస్సేన్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సైదాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చంపాపేట ప్రధాన రహదారి పై ఉన్న ఫ్రాంక్లిన్ ఈవీ షోరూం ముందు గుర్తు తెలియని వ్యక్తి(40) అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని పోలీసులకు సమాచారమందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతడిని చికిత్స నిమిత్తం 108లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించా రు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందగా, మార్చురీలో భద్రపర్చినట్లు డీఎస్సై నాగోజు శివశంకర్ తెలిపారు. మృతుడి బంధువులు, తెలిసిన వారు ఎవరైనా ఉంటే సైదాబాద్ పీఎస్‌లో సంప్రదించాలని కోరారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య



రమావత్ శివనాయక్(ఫైల్)

సైదాబాద్ : కల్లుకు బానిసై ఆటో డ్రైవర్ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండ మండలం లక్మాపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ రమావత్ శివనాయక్ అలియాస్ లక్కీ(28) భార్య రాణితో కలిసి సింగరేణి వాంబేకాలనీలో నివాసముంటున్నారు. కొంత కాలంగా మద్యానికి బానిసై ఆటో కిరాయికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. బుధవారం ఉదయం కల్లు తాగి వచ్చి ఇంట్లో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. భార్య ఎంతగా పిలిచినా సమాధానం లేకపోవడంతో తలుపులు పగులగొట్టి చూడగా శివ ఉరేసుకున్నాడు. భార్య రాణి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎంపీ ధర్మభిక్షానికి ఘన నివాళి

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం 14వ వర్ధంతిని సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్‌లోని ధర్మభిక్షం విగ్రహానికి ఆ పార్టీ రాష్ట్ర నాయకులు అందోజు రవీంద్రాచారి, ముత్యాల యాదిరెడ్డితో పాటు పలువురు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ పోరాటం ద్వారా వందలాది ఎకరాల సాగు భూమిని పేదలకు పంచిపెట్టిన గొప్ప నాయకుడని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని జైలు జీవితం గడిపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, అజ్మీర్ హరిసింగ్‌నాయక్, నర్సింహ, దేవేందర్‌గౌడ్, తొర్పునూరి ప్రవీణ్‌గౌడ్, యాదగిరిరెడ్డి, అరుణ, నవనీత, మధు, యాదగిరి, వెంకన్న, రాములు పాల్గొన్నారు.

కొత్తపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పోరాటాలు చేసిన మహాయోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షంకు సీపీఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఆయన వర్ధంతి సందర్భంగా న్యూ నాగోల్‌లోని సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయం ఎస్‌ఏ డాంగే భవన్‌లో నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సమితి సభ్యుడు బొడ్డుపల్లి కష్ణ, నాయకులు ఉడుతల మల్లేష్, ఎం.ప్రదీప్‌కుమార్, రవికుమార్, పి.ఆమని, ఎం.అఖిల, చెరుకు నాగభూషణం, ఈశ్వర్, రాములు, సైదారావు, కే. జగన్‌యాదవ్, ఎం.గోపాల్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



ధర్మభిక్షం, సాంబశివుడు చిత్రపటాలకు నివాళ్లు అర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న తదితరులు



ధర్మభిక్షం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు రవీంద్రాచారి, యాదిరెడ్డి తదితరులు

ధర్మభిక్షం, సాంబశివుడు ఆశయాలను కొనసాగిద్దాం

వనస్థలిపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ధర్మభిక్షం, సాంబశివుడు ఆశయాలను కొనసాగిద్దామని మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న పిలుపునిచ్చారు.

వనస్థలిపురం డివిజన్ హస్తినాపురం చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీసీ సంఘాల ఆధ్వర్యంలో మాజీ ఎంపీ ధర్మభిక్షం, సాంబశివుడు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మీప్రసన్న వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి, సంక్షేమం, గౌరవం కోసం ధర్మభిక్షం చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. వారి పోరాటపటిమను నేటి యువత అందిపుచ్చుకుని హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.